# ఆదర్శం

"ఏమిట్రా! అలా బెల్లం కొట్టిన రాయిలా మాట్లాడవు?" అన్నారు అనంత రామయ్యగారు కిషోర్ మీద మండిపడుతూ.

"అబ్బ! మీరు ఊరుకోండి!" అంది భార్య సావిత్రమ్మ.

"ఒరేయ్ కిషోర్! మీ నాన్న ఎన్నిసార్లు అడుగుతున్నా అలా దాటిస్తుంటే ఎలా మరి. ఈసారైనా ఈ సంబంధం చూడ్డానికి వెళ్దాం" అంది తల్లి.

"అబ్బే, ఇప్పుడు కాదు."

"ఇప్పుడు కాదంటే మరి ఎప్పుడో చెప్పరా!" అన్నారు కటువుగా అనంతరామయ్యగారు.

"ఉద్యోగం - పెళ్ళి రెండింటికి లింకేమిటిరా? ఏదో భగవంతుడి దయవలన మనకి ఏ లోటు లేకుండా గడిచిపోతోంది. చెల్లాయి పెళ్ళి అవనీయ్ అన్నావు. దానికి రెండు అక్షింతలు వేసి పంపించాము. కోడలు కూడా వస్తే నాకు ఆసరాగా, సంతోషంగా ఉంటుం దనుకుంటే ఉద్యోగం వస్తే గాని చేసుకోనంటా వేమిటిరా?" అంది తల్లి.

"ఉద్యోగం పురుష లక్షణం. ఇప్పుడు పెళ్ళయితే ఆ జంజాటంలో పడి ఇక ఉద్యోగం మాట ఎత్తనేమో, అందుకని ..." అన్నాడు తల్లిదగ్గర గారాలు పోతూ.

"సరే, నీకు ఆరు నెలలు టైము ఇస్తున్నారా! ఈ లోపున ఉద్యోగం వచ్చినా, రాకపోయినా నీ పెళ్ళి చేయడం ఖాయం" అంటూ కండువా భుజం మీద వేసుకుని బయటకు నడిచారు.

** ** **

పోస్టు గ్రాడ్యుయేషన్ పూర్తయిన దగ్గరనుంచి ఈనాటి వరకు కిషోర్ ఉద్యోగాన్వేషణలోనే ఉన్నాడు. ఇంటర్వ్యూకి వెళ్ళడం, ఉద్యోగం ఇవ్వలేనందుకు చింతిస్తున్నామని ఓదార్పుగా వచ్చే ఉత్తరాలు అతనికి వ్యథని కలిగిస్తున్నాయి. ఏ ప్రభుత్వ సంస్థా కూడా అతన్ని ఇప్పటివరకూ కరుణించ లేదు.

అనేక రాత్రులు ఎంతో శ్రద్ధతో కష్టపడి చదివిన చదువుకు సార్థక్యం లే దనిపించి అతనిలో నిరాశా నిస్పృహలు అవ . హిస్తున్నా తన ప్రయత్నాన్ని కొనసాగిస్తూనే ఉన్నాడు.

ఉద్యోగం అంటే ఎండమావి అని అనుభవపూర్వకంగా తెలుస్తున్న కొద్దీ అతడిలో నిరాశ, నిట్టూర్పులు ఎక్కు వవుతున్నాయి. వాటి ఛాయలు ఆ రోజుకీ ఆ రోజుకీ పెరిగిపోవడం అతని ముఖం మీద కనబడుతూనే ఉంది.

గత కొన్ని రోజులుగా కొడుకులో మార్పులు గమనిస్తున్న అనంతరామయ్యగారికి కొడుకు ఏమైపోతా డో అని మనసులో బెంగగా ఉంది. రాను రాను వాడిలో వచ్చే మార్పులు, ముభావం, ఎవరిమీదో తెలియని కసి - ఇవన్నీ వాడి మానసిక ఆరోగ్యానికి మంచివి కావని ఆయనకు తెలుసు.

అమ్మాయి పెళ్ళికి నానా అవస్థలూ పడి కట్న కానుకలు సరిపెట్టడానికి ఎంత బాధపడిందీ తెలుసు. అందుకే అలాంటి బాధ మరో ఆడపిల్ల తండ్రికి కలగకుండా ఉండాలని, ఉన్న ఒక్క కొడుక్కి కట్నం తీసుకోకుండా వివాహం చేయాలని నిర్ణయించుకున్నారు. కిషోర్ మునుపటిలా హుషారుగా ఉండాలంటే వివాహం చేసేస్తే వాడిలో మార్పు రావచ్చని గట్టిగా నమ్మదలించారు.

** ** **

"పోస్ట్!"

పోస్టుమాన్ అందించిన కవర్‌ని ఆత్రంగా విప్పాడు కిషోర్. ఇంటర్వ్యూకి రమ్మని పిలుపు.

ఆ రోజే ఇంటర్వ్యూ. పొద్దున్న లేచిన దగ్గర నుంచి తెగ హడావుడి పడిపోతున్నాడు. దేముడి పటాలకి ఉద్యోగం తప్పక రావాలని పదీ పదీ నమస్కారాలు చేస్తున్నాడు.

## పొన్నగంటి పార్వతి

అందరికంటే ముందుగా ఆఫీసుకు ఒక గంట ముందుగానే చేరాడు. ఒక్కొక్కరూ చేరేటప్పటికి ఇంటర్వ్యూ టైమయింది. అందరూ లోపలికి వెళ్ళి వస్తున్నారు. వెళ్ళేటప్పు డున్న హుషారు వచ్చేటప్పుడు వాళ్ళ ముఖాల్లో కనిపించడం లేదు కిషోర్‌కి. తన వంతు వచ్చేటప్పటికి కాలర్ సర్దుకుని లోపలికి అడుగుపెట్టాడు. వాళ్ళు అడిగిన ప్రశ్నలకు బాగానే సమాధానం చెప్పా నన్న తృప్తితో వెలుపలికి వచ్చాడు.

"కాయా, పండా?" అన్నాడు దారిలో స్నేహితుడు కనిపించి.

"ఈసారి ఉద్యోగం రావడం ఖాయంరా!" అన్నాడు ధీమాగా.

"అంత బాగా చేశావా ఇంటర్వ్యూ! అయితే మాకు పెద్ద పార్టీయే ఎరేంజ్ చేస్తున్నా వన్న మాట" అన్నాడు కిషోర్ భుజం తడుతూ.

** ** **

పదిహేను రోజులు తిరక్కుండా ఆర్డర్స్ చేతిలో పడ్డాయి కిషోర్‌కి. కొడుక్కి నాలుగంకెల జీతంతో ఉద్యోగం వచ్చిం దని తల్లీ, తండ్రీ ఎంతో సంతోషపడిపోయారు. వెంటనే సంబంధాల వేటలో పడిపోయారు. రెండు మూడు సంబంధాలు తమకు అన్ని విధాలా బాగున్నా యనిపించి, అమ్మాయిని చూడ్డానికి త్వరలో వస్తామని కబురు చెశారు అనంతరామయ్యగారు.

మంచిరోజు చూసుకుని పెళ్ళి చూపులకు ప్రయాణ మయ్యారు. అసలే అందగాడేమో, దానికి తోడు చదువు, ఉద్యోగం ఉన్నాయని ఆడపిల్లల తల్లిదండ్రులు తను ఇంటి అల్లుడిని చేసుకోవాలని ఆశపడటంలో తప్పు లేదు.

ముందుగా అనుకున్న సంబంధాలు చూసిన తరువాత సంధ్య తనకు అన్ని విధాలా నచ్చింది. అది ఖాయం చేయమన్నాడు తండ్రిని.

పరాత్పరరావుకి సంధ్య ఏకైక పుత్రిక. చూడగానే పరవాలేదు అనిపించే అందం. డిగ్రీ చదివి బాంక్‌లో ఉద్యోగం చేస్తోంది. వెనుక కొద్ది, గొప్ప ఆస్తికి వారసురాలు ఆమె అనడంతో ఇక ఆలోచించే పని లేదని, వెంటనే నిశ్చయ తాంబూలాలు పుచ్చుకోవడం జరిగిపోయాయి.

** ** **

"ఎంత లక్కీ ఫెలోవిరా! ఉద్యోగం రావడమే కాకుండా, ధనలక్ష్మిని కూడా వరించావు కదరా!" అన్నాడు వెడ్డింగ్ కార్డు చూస్తూ అనిల్.

"అంతా ఆ భగవంతుడి దయరా!" అన్నాడు చిద్విలాసంగా నవ్వుతూ కిషోర్.

"అయితే ఆ భగవంతుడు నన్ను ఎప్పుడు కరుణిస్తాడో కదా!" అన్నాడు దేముడి పటానికి దణ్ణం పెడుతూ - ఉద్యోగం వేటలో విసిగిపోయిన అనిల్.

"వెరీ సింపుల్‌రా! దేముడికి కొంచెం పెట్టుబడి పెట్టు. నీ పైన కూడా కరుణిస్తాడు" అన్నాడు.

"ఎలారా?" అన్నాడు ఆత్రంగా.

"మనకా ఏళ్ళు గడిచిపోతున్నా ఉద్యోగం రాదు. రికమెండేషన్ అయినా ఉండాలి. లేకపోతే ఇచ్చుకోవడానికి దక్షిణ అయినా ఉండాలి. మొదటిది మన వల్ల అయ్యే పని కాదు. అందుకే రెండోదానికి ప్రయత్నించాను. గ్రాండ్ సక్సెస్!" అన్నాడు నవ్వుతూ.

"ఏం తిచ్చావురా?'

"పాతికవేలు. మా నాన్నవి ఆదర్శ భావాలు. అయితే వారి ఆదర్శం మా చెల్లి పెళ్ళి చేయడానికి పని చేయలేదు. ఉన్నదంత ఊడ్చి, మా చెల్లికి పెళ్ళి చేసి పంపించారు. ఇప్పుడు కట్నం తీసుకోను నా కొడుక్కి అంటున్నాడు. నాన్న బాధలు చదువుకున్నప్పుడు ఎంతో అభ్యుదయంగా, ఆదర్శంగా అనిపించి కట్నం తీసుకోను అని లెక్చ రిచ్చాను. అప్పు డేదో ఆవేశంలో అన్నా మనుకోరా! జీవితం ముందు ముందు ఎలారా? మా బాబు దేన్నో లేనింటిదాన్ని చూసి కట్టబెడతా డు. అదే ఉద్యోగం అంటూ ఉంటే, పెద్ద సంబంధాలే వస్తాయి. అందుకే, డబ్బుతో పనవుతుందని తెలిసి, ప్రతాప్ నడిగి దక్షిణ ఇచ్చుకున్నాను. అది ఎలాగూ తీర్చుకుంటా నన్న నమ్మకం నాకు ఉం దనుకో! ఇప్పుడు మా నాన్న మాటకు గౌరవం ఇచ్చినట్టూ ఉంటుంది. నేనూ మాట నిలుపుకున్నట్టూ ఉంటుంది" అన్నాడు. లేస్తూ స్నేహితుడి భుజం తట్టాడు.

"వీడికి ఇన్ని తెలివితేటలు ఎలా వచ్చాయా?" అనుకుంటూ అనిల్ చూస్తూ ఉండిపోయాడు వెళ్ళిపోతున్న కిషోర్‌ను. ★